క్లుప్తంగా

రోగులకు సీనియర్ సిటిజన్స్ వితరణ



రోగులకు మజ్జిగ ప్యాకెట్లు, బ్రెడ్లు పంచిపెడుతున్న సీనియర్ సిటిజన్స్

అమలాపురం టౌన్: అమలాపురం ఆర్య వైశ్య సీనియర్ సిటజన్స్ అసోసియేషన్ ప్రతినిధుల బృందం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని రోగులకు మజ్జిగ ప్యాకెట్లు, బ్రెడ్లు మంగళవారం పంపిణీ చేశారు. మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని రోగులకు దాహార్తిని తీర్చేందుకు వితరణ కార్యక్రమం చేపట్టినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు, కార్యదర్శి అప్పన హరిప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కోదండరామ్‌కు పుదుచ్చేరి ఎస్పీగా పదోన్నతి



యానాం: యానాం పట్టణానికి చెందిన చింతా కోదండరామ్‌కు పుదుచ్చేరిలో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(పీఓపీ)గా పదోన్నతినిస్తూ మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌వర్మ ఆదేశాలు జారీ చేశారు. 1991లో ఎస్ఐగా చేరిన ఆయన వివిధ హోదాల్లో విధులు నిర్వహించడమే కాకుండా ఇటీవలి వరకూ ఎస్పీగా తాత్కాలికంగా కరెంట్ డ్యూటీ చార్జిని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో అడ్‌హక్ బేసిస్‌పై కోదండరామ్‌ను పూర్తి స్థాయి ఎస్పీగా నియమించి పదోన్నతి కల్పించారు. ఈ సందర్భంగా యానాంకు చెందిన పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

యునైటెడ్ పాస్టర్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎంపిక

అమలాపురం రూరల్: మండల యునైటెడ్ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షునిగా పాస్టర్ మొసలి స్పర్జన్ రాజు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ఎన్నికల సమావేశం రంగాపురం సీయోను ప్రార్థన మందిరంలో మంగళవారం జరిగింది. కోనసీమ జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు కార్ల్ డేవిడ్ పరిశీలకుడుగా గొల్లపల్లి సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా సరెళ్ళ నోబుల్ రాయ్, సెక్రటరీగా సీహెచ్ ఆనందరావు, జాయింట్ సెక్రటరీగా గొల్లపల్లి కృపావరం, ట్రెజరర్‌గా జోసెఫ్, జాయింట్ ట్రెజరర్‌గా జాన్ వెస్లీలను ఎన్నుకున్నారు.

ఘనంగా రుద్ర హోమం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమం ఘనంగా జరిగింది. పరమ శివుని జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో స్వామికి గణపతి పూజ, మండపారాధన, రుద్రహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా సోమాలమ్మ జాతర

ఉప్పలగుప్తం: స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలోని చీకట్లపాలెం గ్రామదేవత సోమాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి తీర్థం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

పైపులైన్ పనులను అడ్డుకున్న గ్రామస్తులు

అల్లవరం: డి.రావులపాలెం పంచాయతీ పరిధిలోని బళ్లవారిపేటలో ఇటీవల రూ.35 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ఓహెచ్ఆర్ ట్యాంక్ నుంచి మంగళవారం రాత్రి అనధికారికంగా నిర్మిస్తున్న పైపులైన్ పనులను స్థానిక సర్పంచ్ ఉండ్రు భగవాన్‌దాస్‌తో పాటు కొంత మంది గ్రామస్తులు అడ్డుకున్నారు.

దేవస్థానం భూమిపై ఆర్‌ఏఓకు మరో ఫిర్యాదు

యానాం: దరియాలతిప్పలోని యానాం భూసమేత వేంకటేశ్వరస్వామివారి దేవస్థానానికి చెందిన భూమి అన్యాక్రాంతానికి గురైందంటూ ఆర్ఏఓ మునిస్వామికి భూదాత కుటుంబీకులైన కేవీఎస్ రామయ్య ద్వారా మరో ఫిర్యాదు మంగళవారం అందింది. యానాం వేంకటేశ్వర స్వామి ఉత్సవాల నిర్వహణ కోసం తమ పూర్వీకులైన కశిరెడ్డి కుటుంబీకులు దరియాలతిప్ప అడవిపాలంలోని కొంత వ్యవసాయ భూమిని దేవస్థానానికి ఇచ్చారని రామయ్య చెప్పారు. తమ వంశీయులమంతా ఉద్యోగాల రీత్యా వివిధ రాష్ట్రాల్లో ఉండడంతో ఆసరాగా తీసుకుని కొందరు ఆ భూమిని అన్యాక్రాంతం చేయాలని చూస్తున్నారన్నారు. 1991లో పుదుచ్చేరి గెజిట్‌లో యానాం దేవస్థానానికి సంబంధించి దాతల వివరాలు పొందుపరిచారన్నారు. వాటినినిర్ధారణ చేయించి తమ కుటుంబసభ్యులు ఇచ్చిన ఆస్తులను పరిరక్షించి యానాం వెంకన్న దేవస్థానానికి తిరిగి అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో నల్లా వెంకన్న, దవులూరి సతీష్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణతో విజ్ఞానం.. వినోదం..

- కిటకిటలాడుతున్న ఉచిత శిక్షణ శిబిరాలు
- సెలవులను సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు



అమలాపురంలో ఉచిత శిక్షణ శిబిరంలో బాస్కెట్ బాల్ ఆడుతున్న విద్యార్థినులు



గ్రంథాలయంలో చదరంగం, వైకుంఠ పాళీ ఆడుతున్న చిన్నారులు

అమలాపురం టౌన్: స్కూళ్లకు వేసవి సెలవులు ఇవ్వగానే విద్యార్థులు తమ బంధువుల ఇళ్లకో లేదా విహార యాత్రలకో పయనమవుతుంటారు. అయిదేళ్ల కిందటి వరకూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచనలు అలాగే ఉండేవి. ఇప్పుడు దానికి భిన్నంగా సెలవులు ఇవ్వగానే పిల్లలకు ఇష్టమైన రంగాన్ని గుర్తించి శిక్షణ ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. వేసవిలో పలు సంస్థలు వివిధ విభాగాల్లో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ తరగతుల వైపు తమ పిల్లలను అడుగులు వేయిస్తున్నారు. సెలవుల్లో విహార యాత్రలు వద్దు.. విజ్ఞాన సముపార్జనే ముద్దు అనే నినాదంతో ముందుకు సాగుతున్నారు.

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో వేసవిలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ శిబిరాలకు విద్యార్థులు క్యూ కడుతున్నారు. సెలవుల్లో చిత్రలేఖనం, యోగా, కథలు, హ్యాండ్ రైటింగ్‌తో పాటు చెస్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ తదితర క్రీడల్లో శిక్షణ తీసుకునే ట్రెండ్ ఎక్కువైంది. అమలాపురంలో జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్, గోపాలకృష్ణ గోఖలే ఐపీఎస్ మెమోరియల్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల క్రీడా స్థలంలో ప్రస్తుతం జరుగుతున్న ఉచిత వేసవి బాస్కెట్ బాల్ శిక్షణ శిబిరానికి నిత్యం దాదాపు 150 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం ఈ క్రీడలో పిల్లలకు కోచ్ ఉమ పూర్తి స్థాయిలో శిక్షణనిస్తున్నారు. అమలాపురం ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి సందర్భంగా 33 రోజుల పాటు విద్యార్థులకు పలు రంగాల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఒక్క అమలాపురం, ముమ్మిడివరంల్లోనే కాదు గ్రామగ్రామాన శిక్షణ తరగతులు విజ్ఞానదాయకంగా జరుగుతున్నాయి. అనేక గ్రంథాలయాల్లో విద్యార్థులకు పుస్తక పఠనంపై శిక్షణనిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. దీంతో చాలాచోట్ల కళాత్మక వస్తువులు తయారు చేయడాన్ని సైతం నేర్పిస్తున్నారు.

వేసవి ఉచిత శిక్షణ ఓ నిఘంటువు



అమలాపురంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వివిధ రంగాల్లో నిపుణులచే విద్యార్థులకు ఇప్పిస్తున్న ఉచిత వేసవి శిక్షణ తరగతులు వారికి ఓ నిఘంటువులా ఉపయోగపడుతున్నాయి. నేటి కంప్యూటర్ యుగంలో కొన్ని సంప్రదాయ అలవాట్లకు దూరమవుతున్న నేటి విద్యార్థులకు ఈ శిక్షణ తరగతులు సరికొత్త విజ్ఞానాన్ని, వినోదాన్ని అందిస్తున్నాయి. – పోలిశెట్టి సత్యనారాయణమూర్తి, గ్రంథాలయ నిర్వాహకుడు, ప్రథమ శ్రేణి గ్రంథాలయం, అమలాపురం

కళాత్మక వస్తువుల తయారీ నేర్చుకుంటున్నా



గతంలో సెలవులొస్తే బంధువుల ఇంటికి వెళ్లే నేను ఈసారి గ్రంథాలయ శిక్షణ తరగతులకు హాజరవుతున్నాను. ఉచిత శిక్షణ తరగతుల్లో ఆట పాటలే కాకుండా విజ్ఞానాన్ని పెంచే పుస్తక పఠనంపై రోజూ అవగాహన పెంచుతున్నారు. పనికి రాని వస్తువులతో కళాత్మక వస్తువుల తయారీ నేర్చుకుంటున్నాను. – పిల్లి యశ్వంత్ రాజ్, 7వ తరగతి విద్యార్థి, మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూలు, అమలాపురం

ఉపాధ్యాయుడికి రాష్ట్రస్థాయి బహుమతి



నటుడు ఎల్బీ శ్రీరామ్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న సునీల్‌బాబు

అల్లవరం: అల్లవరం మండలం తాడికోన యూపీ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లికి చెందిన ఎస్.సునీల్‌బాబు హాస్యానందం మాస పత్రిక ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి కార్టూన్ పోటీల్లో విశిష్ట బహుమతి సాధించారు. హైదారాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు కేవీ రమణాచారి, ప్రముఖ నటుడు ఎల్బీ శ్రీరామ్ చేతుల మీదుగా సునీల్‌బాబు బహుమతిని అందుకున్నారు.

ప్రభుత్వం ఆక్వా రైతులను ఆదుకుంటుంది

కాట్రేనికోన: ఆక్వా రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మత్స్యశాఖ జేడీ షేక్ లాల్ మహ్మద్ అన్నారు. చెయ్యేరులో ఉమా రామలింగేశ్వర ఆక్వా ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్యాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆక్వా రైతుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జేడీ షేక్ లాల్ మహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆక్వా రైతులకు సబ్సిడీపై విద్యుత్‌ను అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ జేడీని ఆక్వా రైతులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లి సురేష్, నడింపల్లి సూరిబాబు, టి.నాగభూషణం, సురేష్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- సోమిదేవరపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం



సోమిదేవరపాలెం గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి సోమిదేవరపాలెంలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ వారికి కలుగుతున్న లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. నవరత్నాలలో లబ్ధిదారులకు చేకూరిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో చేయని పెండింగ్ పనులను ప్రస్తుత వైఎస్సార్ ప్రభుత్వం చేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెన్మత్స చిట్టిరాజు, మండల పార్టీ కన్వీనర్ జగతా పద్మనాభం, తాడి అచ్యుత రామయ్య, వస్త్రాల వీరన్న, బుడితి శ్రీను, వైస్ చైర్మన్ వేటుకూరి బోసురాజు, రెడ్డి శివన్నారాయణ, దొమ్మేటి అప్పారావు, నగర పంచాయతీ కమిషనర్ జి.లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

సురభి-గోరక్ష దీక్షా యాగం ప్రారంభం

- లక్ష గో పిడకలతో ఊరేగింపు



మహిళలు, చిన్నారుల కోలాటాల మధ్య రెండెడ్ల బండ్లపై లక్ష గో పిడకలను ఊరేగిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: స్థానిక వేదమాత గాయత్రి దివ్యభవ్య సాధనా మందిరం గీతాశ్రమ ప్రాంగణంలో లక్ష గో పిడకలతో సురభి-గోరక్ష దీక్షా యాగం మంగళవారం ప్రారంభమైంది. ఈ నెల 23 నుంచి 29 వరకూ మహీ వారాహ ట్రస్ట్ చైర్మన్ కుందుర్తి మహీ కిరణ్‌శర్మ పర్యవేక్షణలో యాగం జరగనుంది. యాగానికి ముందు గో వృషభ గ్రామోత్సవం పుర వీధుల్లో వైభవంగా సాగింది. అలాగే యాగం నిర్వహించే లక్ష గో పిడకలను పూలతో అలంకరించిన రెండెడ్ల బండ్లపై ఊరేగించారు. మహిళల కోలాటాల సందడితో ఊరేగింపు సాగింది. ఊరేగింపులో పట్టణ ఆర్య వైశ్య మహిళలు గో వృషభాలకు, లక్ష గో పిడకలకు పసుపు కుంకుమ, పుష్పాలతో పూజలు చేశారు. ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఊరేగింపులో పాల్గొన్న భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. వేదమాత ట్రస్ట్ కార్యదర్శి కోకా రాంబాబు, కోశాధికారి ఆకుల శ్రీదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే..

- మంత్రి తనయుడు పినిపే శ్రీకాంత్
- కొమరిగిరిపట్నంలో గడప గడపకూ మన ప్రభుత్వం



కొమరిగిరిపట్నం గడప గడపకూ కార్యక్రమంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న పినిపే శ్రీకాంత్

అల్లవరం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విశ్వరూప్ తనయుడు పినిపే శ్రీకాంత్ అన్నారు. కొమరగిరిపట్నం-3 గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా, పారదర్శకంగా అందుతున్నాయో లేదో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబం లబ్ధి పొందుతుందన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పథకాలు కొనసాగింపు జరుగుతాయని, వచ్చే ఎన్నికల్లో ఆయన్ని దీవించాలని లబ్ధిదారులను కోరారు. కొనుకు గౌతమి, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, సొసైటీ చైర్మన్ సురేష్‌రాజు పాల్గొన్నారు.

ఆటోనగర్ ఏర్పాటు చేయాలి

అమలాపురం టౌన్: అమలాపురంలో ప్రభుత్వం ఆటోనగర్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని పలు వ్యాపార అసోసియేషన్ల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. మంగళవారం స్థానిక సీతాపతిరావు పేటలోని ది కోనసీమ డీజిల్ అసోసియేషన్ భవనంలో పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆటోనగర్ ఏర్పాటును కోరుతూ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతి పత్రం ఇవ్వాలని తీర్మానించారు. ఆటోనగర్ ఏర్పాటుకయ్యే వ్యయంలో 70 శాతం ప్రభుత్వం భరిస్తే మిగిలిన 30 శాతం నిధులు వ్యాపార అసోసియేషన్లు భరించేందుకు సంసిద్ధంగా ఉన్నాయని పలువురు వ్యాఖ్యానించారు. సమావేశంలో ది కోనసీమ డీజిల్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుందరనీడి వెంకటేశ్వరరావు, లేతు అండ్ ఆర్క్ వెల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధి ఆర్.రవి, గ్యాస్ వెల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధి కాశే చంటి, ఎలక్ట్రికల్ రీ వైండింగ్ అసోసియేషన్ వై.వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం



కాట్రేనికోనలో తీగలపై పడిన విద్యుత్ స్తంభం

కాట్రేనికోన: ఒకపక్క అధిక ఉష్ణోగ్రతలతో ఎండలు దంచేస్తుంటే కాట్రేనికోన మండలంలో మాత్రం మంగళవారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మండలంలోని కాట్రేనికోన, వేట్లపాలెం, గచ్చకాయలపోర, చిర్రయానం, చెయ్యేరు, చెయ్యేరు అగ్రహారం, దొంతికుర్రు, కందికుప్ప, కొత్తపాలెం, బలుసుతిప్ప, పల్లంకుర్రు తదితర గ్రామాల్లో మంగళవారం వీచిన ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు, చెట్లు కుప్పకూలిపోయాయి. అనేకచోట్ల విరిగిపడిన చెట్లు విద్యుత్ లైన్లపై పడటంతో తీగలు తెగిపోయాయి. దీంతో మండలంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కళ్లాల్లో ఉన్న ధాన్యంతో పాటు మిల్లుకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన సుమారు 20 ట్రాక్టర్లపై ఉంచిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. కాట్రేనికోన ఏఈ బి.నాగేశ్వరరావు సిబ్బందితో పాటు విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టి తిరిగి విద్యుత్ సరఫరా ఇచ్చారు.

చిన్నారుల విద్యాభివృద్ధికి చెకుముకి సంబరాలు

యానాం: చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నామని పర్యావరణ, సైన్స్ సంబంధిత విషయాలపై అవగాహన కల్పిస్తున్నామని జన విజ్ఞాన వేదిక యానాం శాఖ అధ్యక్షుడు ఆనాల వీరభద్రరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక యానాం పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన జనవిజ్ఞానవేదిక సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి మొహిబుల్లాఖాన్, ప్రముఖ కవి దాట్ల దేవదానంరాజు, రాష్ట్ర ప్రతినిధి కేవీవీ సత్యనారాయణ, కె.జానకిరాముడు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అండగా ప్రభుత్వం



కౌలు రైతు సదస్సులో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ

తాళ్లరేవు: కౌలు రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. మంగళవారం పి.మల్లవరం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కౌలు రైతు సదస్సు గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు ముందుగానే పంటలు వేయాలని, ఏడాదికి మూడు పంటలు పండించేలా రైతులు కృషి చేయాలని కోరారు. కౌలు రైతులకు మేలు చేసే విధంగా ప్రభుత్వం కౌలు రైతు కార్డులను పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.పోతురాజు, జెడ్పీ మాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు, గ్రామ సర్పంచ్ దున్నా సత్యన్నారాయణ, ఉంగరాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబరావుకు సత్కారం



కుటుంబరావును సత్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ తదితరులు

తాళ్లరేవు: బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ) స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన న్యాయవాది యడ్ల కుటుంబరావును ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఆధ్వర్యంలో దుశ్శాలువాలు, పూలమాలలతో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ బౌద్ధం మతం కాదని, అది ఒక జీవన సన్మార్గమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ముద్దన శివరామ ప్రసాద్, పేర్ని ఆదినారాయణ మూర్తి, రెడ్డి అరుణ సుహాసినీదేవి, వెంటపల్లి నూకరాజు, దడాల సువర్ణలత తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మస్తర్లు లేకుండా పనులకు వేతనాలు

అమలాపురం రూరల్: ఉపాధి హామీ పథకంలో కూలీలతో చేపట్టిన పనుల్లో సంతకాలు, మస్తర్లు లేకుండానే వేతనాలు చెల్లించినట్లు తేలింది. తాండవపల్లి, ఇమ్మిడివరప్పాడు, సాకుర్రుతో పాటు పలు గ్రామాల్లో అక్రమాలు జరిగినట్లుగా సామాజిక తనిఖీల్లో బయటపడింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి 22 గ్రామాల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేపట్టి లోపాలను గుర్తించింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజా వేదికకు డ్వామా పీడీ మధుసూదన్, ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, ఏపీడీలు సత్యనారాయణ, చంద్రమోహన్, ఎంపీడీవో కాశీ విజయప్రసాద్‌లు హాజరయ్యారు. వేమవర్పాడు, రెడ్డిపల్లి గ్రామాల్లోని బల్క్ మిల్క్ సెంటర్లకు వాడాల్సిన సిమెంట్ బస్తాలను వేరే నిర్మాణాలకు వినియోగించారని గుర్తించారు. అవకతవకలకు సంబంధించి క్షేత్ర సహాయకుల నుంచి రూ.5,479, పీఆర్ పనులకు సంబంధించి రూ.6,41,517 రికవరీకి డ్వామా పీడీ మధుసూదన్ ఆదేశించారు.

సంఘాలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

ముమ్మిడివరం: స్వయం సహాయక సంఘాల సభ్యులు సూక్ష్మ వ్యాపార సంస్థలను ఏర్పాటు చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని డీఆర్డీఏ పీడీ శివశంకర ప్రసాద్ సూచించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయ సంఘాల సభ్యులకు సూక్ష్మ వ్యాపార రుణ అనుసంధానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ శివశంకర ప్రసాద్ మాట్లాడుతూ స్వయం సంఘాల సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించి సూక్ష్మ వ్యాపారాలను పోత్సహిస్తున్నామన్నారు. స్టేట్ బ్యాంకు నుంచి చక్రవర్తి, ఎల్‌డీఎం శ్యాంబాబులు మాట్లాడుతూ బ్యాంకు లోన్ అప్లికేషన్, రేట్ ఆఫ్ ఇంటరెస్ట్, రుణ సదుపాయం పొందే సభ్యుల ఎంపిక వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఏడీ పందిరి మామిడయ్య, డా.వంగయ్య, నాబార్డు ఏజీఎం శ్రీనివాస్, ఎంఎం జిలాని, ఏపీడీ డీపీఎల్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సింగపూర్‌లో మహిళ అనుమానాస్పద మృతి



లక్ష్మీసునంద(ఫైల్)

యానాం: యానాంకు చెందిన వివాహిత దిగుమర్తి లక్ష్మీసునంద(30) సింగపూర్ దేశంలో మృతి చెందినట్లు మంగళవారం సమాచారం అందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక శారదా ప్రభుత్వ ఎయిడెడ్ ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చిక్కాల వెంకటేశ్వరరావు కుమార్తె లక్ష్మీసునంద ఆమె భర్తతో కలిసి సింగపూర్‌లో గత కొన్నేళ్లుగా నివసిస్తున్నారు. మంగళవారం ఆమె ఓ భవనం 13వ అంతస్తు నుంచి పడిపోవడంతో మృతిచెందినట్లు సమాచారం అందడంతో కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముమ్మిడివరం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం రాత్రి మృతి చెందాడు. ఈ నెల 12న రాజమహేంద్రవరానికి చెందిన కర్రి రాంబాబు(53), అనాతవరానికి చెందిన చెల్లి శ్రీనివాసరావులు తమ బంధువు ఇంటికొచ్చి తిరిగి మోటారు బైక్‌పై అమలాపురం వెళుతుండగా అనాతవరం సెంటర్‌లో అదుపు తప్పి పడిపోయారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాంబాబును కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు రాంబాబుకు భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు కుమార్తెలున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొనడం వల్లే బాలిక మృతి

అమలాపురం టౌన్: అమలాపురం గాంధీనగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాలిక జంగా లక్ష్మి జాహ్నవి(11) మట్టి లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఢీకొట్టడం వల్లే మృతి చెందినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ విషయాన్ని పట్టణ సీఐ ద్వారంపూడి దుర్గాశేఖరరెడ్డి మంగళవారం రాత్రి వెల్లడించారు. రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందిన జాహ్నవి కేసును సీఐ దుర్గాశేఖరరెడ్డి పట్టుదలగా తీసుకుని లోతుగా దర్యాప్తు చేశారు. ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందమోనన్న కోణంలో ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీలను సేకరించి విచారించారు. గాంధీనగర్ రోడ్డు మీదుగా ముఖ్యంగా మట్టి లోడుతో వెళుతున్న ట్రాక్టర్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి దర్యాప్తు చేశారు. దీంతో ఓ ట్రాక్టర్ ఆమెను బలంగా ఢీకొట్టి పరారైనట్లు తేలింది. బాలిక మృతికి కారణమైన ట్రాక్టర్‌ను గుర్తించి సీజ్ చేసినట్లు సీఐ దుర్గా శేఖరరెడ్డి తెలిపారు. అమలాపురానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తొత్తరమూడి శ్రీనును అదుపులోకి తీసుకున్నామని సీఐ వెల్లడించారు.

విద్యార్థులకు శిక్షణ తరగతులు

అమలాపురం టౌన్: అమలాపురం సత్య సాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకూ 'వేసవి వెన్నెల' అనే ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. యువతలో ముఖ్యంగా విద్యార్థుల్లో ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్ తేవడం శిక్షణ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.